ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 183 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 11 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



### లావోస్ చేరుకున్న
## ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోడీ లావోస్ చేరుకున్నారు. లావోస్ ప్రధాని సోనెక్స్ సిఫాండోస్ ఆహ్వానం మేరకు మేరకు లావోస్ చేరుకున్న ప్రధాని రెండు రోజుల పాటు అక్కడ పర్యటించనున్నారు. ఆసియాన్-ఇండియా సమ్మిట్, తూర్పు ఆసియా సదస్సుల్లో ప్రపంచ నేతలతో చర్చల కోసం ఎదురుచూస్తున్నానని ప్రధాని గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిని సమీక్షించడానికి, సహకారం భవిష్యత్తు దిశను రూపొందించడానికి ఆసియన్ నేతలతో చర్చిస్తానని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

### అశ్రునయనాల మధ్య
# రతన్ టాటా అంత్యక్రియలు
## మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహణ
### అమిత్ షా, సిఎం షిండే, పారిశ్రామిక దిగ్గజాల నివాళి



ముంబై, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): పారిశ్రామిక దిగ్గజం,టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కేంద్రహోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, సిఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటి సిఎం ఫడ్నవీస్, శక్తికాంత్ దాస్, అంబానీ దంపతులు, ఇతర ప్రముఖులు నివాళి అర్పించారు. హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు. అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని ..మిగతా 2లో

### రతన్ టాటా మరణంపై రేవంత్ దిగ్భ్రాంతి
#### వ్యాపార రంగంలో విలువలకు పట్టం కట్టారని నివాళి



ప్రముఖ పారిశ్రామిక వేత్త, మానవతావాది రతన్ టాటా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటు అని అన్నారు. రతన్ టాటా వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన ..మిగతా 2లో

### రతన్ టాటా మృతికి కెసిఆర్ సంతాపం



రతన్ టాటా మృతి పట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు , తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని, సమాజ హితుడుగా.. తాత్వికత, దార్శనిక కార్యాచరణ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. భారత సమాజం గర్వించే ప్రపంచ వ్యాపార దిగ్గజం, పద్మ విభూషణ్ రతన్ టాటా అని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అద్దిన మానవతావాది, దార్శనికుడు, పరోపకారి రతన్ టాటా అని కేసీఆర్ కొనియాడారు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక ఆర్థిక తాత్వికతను సొంతం చేసుకున్న అరుదైన పారిశ్రామిక వేత్త అని ..మిగతా 2లో



### ట్యాంక్‌బండ్‌పై వైభవంగా
# బతుకమ్మ సంబరం
### ఊరూవాడా సద్దుల బతుకమ్మ సంబరాలు
#### పలు జిల్లాల్లో వేడుకగా సాగిన ఉత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి. వేలాదిమందితో బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. అలాగే ట్యాంక్ బండ్ పరిసరాలు మహిళల సందడితో కళకళ లాడింది. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూడి సిఎం మల్లు భట్టి విక్రమార్కలు సంబురాలకు హాజరయ్యారు. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. వేలాది మంది మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిసాయి. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్ని అంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా ..మిగతా 2లో



### కెసిఆర్‌ను విమర్శించకుండా
## ఉండలేరా?
### విమర్శలే మీ ప్రభుత్వ విధానమా
### సిఎం రేవంత్ తీరుపై
### మండిపడ్డ సబిత

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): ఎక్కడ పడితే అక్కడ.. విద్యార్థులు, టీచర్ల ముందు కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా..? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. గడిచిన పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా..? అని అడిగారు. నిన్న డీఎస్సీ నియామక పత్రాల అందజేత సందర్భంగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శించిన తీరుపై సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి మాట్లాడేటప్పుడు అది ..మిగతా 2లో

### ఆదాయ మార్గాలపై
# ఫోకస్ చేయాలి



### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సమీకరణపై వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆదాయం సమకూర్చే శాఖల లక్ష్యాలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు సీఎం. వార్షిక లక్ష్యాలను చేరుకోవడంలో శాఖల పనితీరును మెరుగుపరుచుకోవాలని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి అప్పుల భారం పెరిగిందని, ఆదాయ మార్గాలపై దృష్టి సారించింది కాంగ్రెస్ సర్కార్. ఈ క్రమంలోనే అధికారులతో వరుస భేటీలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆర్థిక మంత్రి భట్టి, పలు శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఖాజానాకు ఆదాయం పెంచేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. లీకేజీలను అరికడుతూ, ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని చెప్పారు. అక్రమ మద్యం, ఇసుక అమ్మకాలు, పన్నుల ఎగవేతను కట్టడి చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.



### ఎన్సీ శాసనసభా పక్షనేతగా
## ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో జమ్ము కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ -కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాధించింది. తాజాగా నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభాపక్షనేతగా ఎన్సీ నేత, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని గురువారం ఎన్సీ సీనియర్ నేత ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. ఎన్సీ శాసనసభాపక్షనేతగా ఎన్నికైన అనంతరం మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడారు. "ఈరోజు నేషనల్ కాన్ఫరెన్స్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది. అందులో నేను లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా ఎన్నుకోబడ్డాను. పార్టీ ఎమ్మెల్యేలందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. అదేవిధంగా 4 స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా ఎన్సీ ప్రభుత్వాన్ని ఏర్పాటు తమ మద్దతు ప్రకటించారు. ప్రస్తుతం ఎన్సీ 42 ఎమ్మెల్యేలు, స్వతంత్ర ఎమ్మెల్యేలు నలుగురిని కలుపుకొని మొత్తం 46 మంది ఎమ్మెల్యేలను కలిగి ఉన్నాం. కాంగ్రెస్ నుంచి మద్దతు లేఖ అందిన వెంటనే మేము జమ్ము కశ్మీర్ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని రాజ్‌భవన్‌కు వెళ్తాం' అని అన్నారు.

# గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

## అప్పడే సిఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.





# కొండా సురేఖపై కెటిఆర్ దావా

## నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. భారాస నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. ఇటీవల కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీరంగంలోని పలువురిని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖపై ఇప్పటికే ప్రముఖ సినీనటుడు నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఇదిలావుంటే నాగార్జున పిటిషన్ ఆధారంగా మంత్రి కొండా సురేఖకు నాంపల్లికోర్టు నోటీసులు జారీ చేసింది. తన కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాంటూ ఈనెల 8న కోర్టును కోరారు నాగార్జున. అలాగే వాంగ్మూలం కూడా ఇచ్చారు. సాక్షిగా సుప్రియ వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసుకుంది. ఆపై ఈరోజుకు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 23కు నాంపల్లి కోర్టు వాయిదా వేసింది.

# కెసిఆర్‌ను విమర్శించకుండా ఉండలేరా?

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ కార్యక్రమా లేక పార్టీ కార్యక్రమా మర్చిపోతున్నారు. మీరు ఇచ్చాం అని చెప్తున్న టీచర్ పోస్టులు కేసీఆర్ మంజూరు చేసినవి కావా..? ఉన్నత విద్యాశాఖలో 3202 పోస్టులు, యూనివర్సిటీలలో 1081 పోస్టులు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసినవి కావా..? అని సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. ఇంటర్, టెక్నికల్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగులను కేసీఆర్ రెగ్యులర్ చేశారు అని చెప్తే బాగుండేది. ఎన్నికల ముందు మీరు చెప్పిన 25,000 టీచర్ పోస్టులు ఎందుకు ఇవ్వలేదు అని ఆ గురువుల ముందు చెప్తే బాగుండేది. ఎన్నికలప్పుడు 6000 పాఠశాలలు మూతపడ్డాయి అని అబద్ధం చెప్పిన మీరు, ఆ పాఠశాలల లిస్ట్ విడుదల చేస్తే బాగుండేది. మన ఊరు మన బడి కార్యక్రమం ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. 6 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్న కేసీఆర్ ప్రవేశ పెట్టిన గురుకులాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేద్దాం అనుకుంటున్నది అని చెప్తే బాగుండేది. ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. ఎన్నికల సమయంలో చెప్పినట్టు ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్తే బాగుండేది. 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న మీరు మిగితా పాఠశాలలను గాలికి వదిలేశాము అని చెప్తే బాగుండేది అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు.

## ట్యాంక్‌బండ్‌పై వైభవంగా

# బతుకమ్మ సంబరం





మొదటి పేజీ తరువాయి...

గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు. గవర్నర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి సంబురాలు జరుపుకుంటుండడంతో పూల పండుగ విశిష్టతను అధికారులు గవర్నర్ దంపతులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనకు పూర్వీకులు ఇచ్చిన గొప్ప ఆచారం, సంస్కృతీ బతుకమ్మ అన్నారు. భవిష్యత్ తరాలకు ఈ పండుగను అందించడమే మన బాధ్యత అని, చెరువులను కబ్జాలు కాకుండా కాపాడుకుందామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ రోజు చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ అంటేనే చెరువులు అని, బతుకమ్మ చెరువుల్లో నీరు తాగేదని, పొలాలకు నీరు అందించేదని ఆమె తెలిపారు. మన జీవన శైలి చెరువులపై ఆధారపడి ఉందని, హైదరాబాద్‌కు లేక్ సిటీ అని పేరు ఉండేదని, కానీ, ఈ రోజు అవి కనుమరుగు అయిపోయాయని ఆమె తెలిపారు. ఆటలు, పాటలు, బతుకమ్మకు పూజలు ఇది తరతరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## రేవంత్ పాలనలో

# రైతులకు నిద్ర లేదు

### ఇచ్చిన హామీల కోసం రోడ్డెక్కుతున్నారు: మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లూ ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# రతన్ టాటా మరణంపై రేవంత్ దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి...

గొప్ప వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి కొనియాడారు. పద్మవిభూషణ్ సహా అనేక గౌరవ పురస్కారాలు అందుకున్న రతన్ టాటా ఇక మన మధ్య లేకపోవడం బాధకరమని అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందించారని గుర్తుచేశారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా రతన్ టాటా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు రేవంత్. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.

# రతన్ టాటా మృతికి కెసిఆర్ సంతాపం

మొదటి పేజీ తరువాయి...

కేసీఆర్ తెలిపారు. సమాజ సంక్షేమం కోసం, రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం జీవితకాలం తపించిన రతన్ టాటా ఆదర్శాలు, కార్యాచరణ ప్రపంచ ఆర్థిక పారిశ్రామిక రంగానికి దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఒక కార్యక్రమానికి హాజరై., నూతన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించడం, సాంకేతిక పారిశ్రామిక రంగాల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దార్శనిక కార్యాచరణ పట్ల రతన్ టాటా ఆనందాన్ని వ్యక్తం చేయడం తెలంగాణకు గర్వకారణమని కేసీఆర్ స్మరించుకున్నారు. మానవతావాది రతన్ టాటా మృతి భారత పారిశ్రామిక రంగానికే కాకుండా సమాజ సంక్షేమాన్ని ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని కేసీఆర్ అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించానని.. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## రతన్ టాటా మరణపై

# సినీ దిగ్గజాల సంతాపం

### దేశానికి తీరని లోటు అన్న పవన్ కళ్యాణ్

### సంతాపం ప్రకటించిన చిరంజీవి, మహేశ్, ఎన్టీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): దిగ్గజ పారిశ్రామివేత్త, టాటా మాజీ ఛైర్మన్ రతన్ టాటా మరణం పట్ల టాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలిపారు. రతన్ టాటా మృతిపట్ల నటుడు, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. రతన్ మరణం దేశానికి తీరని లోటు అని, భారత పారిశ్రామిక రంగానికే కాదు, ప్రపంచ పారిశ్రామిక రంగానికి ఆయన ఆదర్శం అని ప్రశంసించారు. ఉప్పు నుంచి మొదులుకొని విమానయాన రంగం వరకు భారతదేశపు అణువణువులో టాటా అనే పేరు ప్రతిధ్వనిస్తుందన్నారు. సమాజానికి ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమని పవన్ ప్రశంసించారు. భారత దేశం ఇప్పటి వరకు చూసిన గొప్ప దార్శినికుల్లో ఆయన ఒకరని మెగాస్టార్ చిరంజీవి ప్రశంసించారు. సేవలో రతన్‌ను మించిన వారు లేరని, పరోపకారి అని, అసాధరణ మానవుడు అని కొనియాడారు. భారత దేశం నిర్మాణంలో అద్భుతంగా కృషి చేశారరన్నారు. రతన్ మృతి భారతీయులకు బాధాకరమైన రోజు అని చిరు తెలిపారు. రతన్ టాటా ఔదార్యం, వివేకం, నిబద్ధత ప్రపంచంపై చెరగని ముద్ర వేసిందని సూపర్ స్టార్ మహేశ్ బాబు తెలిపారు. పారిశ్రామిక రంగంలో ఓ దిగ్గజాన్ని కోల్పోయామన్నారు. ఆయన ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపి ఎప్పటికీ జీవించే ఉంటారని, గొప్ప వ్యక్తికి వీడ్కోలు పలుకుతున్నామని మహేష్ బాబు పేర్కొన్నారు. రతన్ తెలివితో ఎంతో మంది జీవితాలను మార్చేశారని టాలీవుడ్ నటుడు ఎన్‌టిఆర్ తెలిపారు. భారత దేశం ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటుందని, ఆయనది బంగారంలాంటి హృదయం అని, టాటా ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని ఎన్‌టిఆర్ తెలిపారు.

# అశ్రునయనాల మధ్య రతన్ టాటా అంత్యక్రియలు

మొదటి పేజీ తరువాయి...

అంత్యక్రియల కోసం నిర్దేశిరచిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీనిగా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చింది అలాగే తిరిగి ఐక్యమవ్వాలని వీరి ఆశయం. పార్సీల సంప్రదాయం ఇలా ఉన్నప్పటికీ..మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారింది. దీంతో సోలార్ లేదా విద్యుత్ విధానంలో దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీరు, అగ్ని, నేల కాలుష్యం కాకుండా జొరాస్ట్రియన్ నియమాలకు అనుగుణంగానే అంతిమ సంస్కారాలు కొనసాగిస్తున్నారు. రతన్ టాటా మరణించిన తర్వాత ఆయన అంత్యక్రియలు ఏ పద్ధతిలో జరుపుతారన్న దానిపై విస్తృత చర్చ జరిగింది. ఆయన పార్థివ దేహం వద్ద పార్సీ, ముస్లిం, క్రిస్టియన్ , సిఖ్ అలాగే హిందూ మతాలకు చెందిన వారు ప్రార్థనలు చేస్తూ కనిపించారు. రతన్ టాటాకు నివాళులు అర్పించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, వీఐపీలు ముంబైకి తరలి వచ్చారు రతన్ టాటా ఒక్క వ్యాపారవేత్తంగానే కాకుండా సేవతత్పరతో చాలా దేశ ప్రజల మన్ననలు పొందారు. అందుకే ఆయన లేరనే వార్త తెలిసిన తర్వాత అందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

### రతన్ టాటా మృతికి రాష్ట్రపతి , ప్రధాని సంతాపం

రతన్ టాటా మరణ వార్తతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దిగ్గజ వ్యాపారవేత్తకు నివాళి అర్పిస్తూ గురువారాన్ని సంతాప దినంగా ప్రకటించింది. అలాగే రతన్ టాటా మృతికి సంతాపం తెలుపుతూ జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ గురువారం సంతాప దినం ప్రకటించారు. రతన్ టాటా మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. భారత్ ఒక దిగ్గజ పారిశ్రామికవేత్తను కోల్పోయిందన్నారు. ఆయన చేసిన సేవలు ప్రపంచంలోని ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎక్స్ వేదికగా ఆమె కొనియాడారు. రతన్ టాటా మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. రతన్ టాటా దూరదృష్టి ఉన్న వ్యాపార వేత్త అని మోడీ కొనియాడారు. ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు స్థిరమైన నాయకత్వం అందించారని, మెరుగైన సమాజం కోసం ఆయన కృషి చేశారన్నారు. వ్యాపారం, దాతృత్వంలో రతన్ టాటా శాశ్వత ముద్ర వేశారని ఎఐసిసి అగ్రనేత రాహుల్ ప్రశంసించారు. పారిశ్రామికవేత్త, గొప్ప మానవతావాదిని భారత్ కోల్పోయిందని బాధను వ్యక్తం చేశారు. రతన్ టాటా నిష్క్రమణ పారిశ్రామికరంగానికి, దేశానికి తీరనిలోటు అని అన్నారు. నిబద్దత, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తి రతన్ టాటా అని ప్రశంసించారు.



# రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పత్తి కుంట వద్ద బతుకమ్మ లతో మహిళలు

బుద్వేల్, అక్టోబరు10 (ప్రభాత ఉదయం) : రాజేంద్ర నగర్ సర్కిల్ లో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రతి ఇంటి ముందు బతుకమ్మలను ఆడి స్థానిక కొనులలో, చేరువు లలో బతుకమ్మలను వదిలారు.





హైదర్‌గూడలో....






బతుకమ్మ లకు స్వాగతం పలుకుతున్న ప్రణవ భక్త సమాజం సభ్యులు





బాబుల్‌రెడ్డినగర్‌లో...



రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం లో ఆడిన దాండియ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి వేముల రామకృష్ణ



దాండియ ఆడుతున్న వేముల రామకృష్ణ



దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



బుద్వేల్‌లో బతుకమ్మ మహిళలు

## బుద్వేల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

రాజేంద్రనగర్, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక మహిళలు మా ఇంటి ముందు బతుకమ్మను ఆడి పాటలతో నిర్వహించారు.



పద్మశాలి పురంలో కొనసాగుతున్న దుర్గామాత ప్రజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్

## దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి: మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్

పద్మశాలిపురంలో నెలకొల్పిన దుర్గామాత వద్ద పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్

రాజేంద్రనగర్, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పద్మశాలిపురంలో శ్రీదేవి శరణన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన పూజల్లో మాజీ కార్పొరేటర్ టి ప్రేమదాస్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ దాస్ గౌడ్ మాట్లాడుతూ... దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక నాయకులు మసున వెంకటేష్, ఎల్లప్ప, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన కేసులో నిందితులకు జైలుశిక్ష

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం)దాడి చేసిన కేసులో ఏడు మంది నిందితులకు 3 సంవత్సరాల జైలు శిక్ష మరియు ఒక్కొక్కరికీ రూ. 500 జరిమాన విధిస్తూ గురువారం గద్వాల కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉదయ్ నాయక్ తీర్పు వెల్లడించారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం... రాయచూరు జిల్లా వడ్లం దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ జంగిలమ్మ మే నెల 2018 లో కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ పొలంలో పోటేళ్లను తీసుకొని గడ్డి మేపడానికి వెళ్లగా వారి పొలంలో గెట్టు రాళ్లు తొలగించడం గమనించింది. ఈ విషయం పై పక్కల పొలంలో పని చేసుకుంటున్న పాలివాళ్ళ అయిన అనంతమ్మ, గోవిందమ్మ లను నిలదీయగా... అనంతమ్మ, గోవిందమ్మలు ఇద్దరు కలిసి బూతులు తిడుతూ మే మే రాళ్లు తీశాం ఏమీ చేస్తావు అని గొడువకు దిగ్గారు. ఆ సమయంలో కుర్వ జంగిల్లమ్మ ముగ్గురు కుమారులు పొలం దగ్గరుకు రాగా వారిని అనంతమ్మ, గోవిందమ్మ లతో పాటు నర్సింహులు, మల్లయ్య , జనార్దన్, విజయ కుమార్, వీరేష్ అనే వ్యక్తులు కలిసి దాడి చేయడంతో జంగిల్లమ్మ కుమారులకు తీవ్రగాయాలయ్యాయి. జూన్ 1, 2018లో కుర్వ జంగిలమ్మ కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి యస్.హెచ్.ఓ బాగ్య లక్ష్మి రెడ్డి కేసు నమోదు చేసి విచారణ పూర్తి చేసి గద్వాల కోర్టు లో చార్జి షీట్ వేశారు. గద్వాల కోర్టు లో ట్రయల్స్ నడుస్తున్న సమయంలో గద్వాల డి.ఎస్పి సత్యనారాయణ పర్యవేక్షణలో గద్వాల్ ఇంచార్జి సిఐ నాగేశ్వర్ రెడ్డి, కేటిదొడ్డి ఎస్సై శ్రీనివాసులు సాక్షులను పకడ్బందీగా బ్రీఫింగ్ చేసి తగిన చర్యలు తీసుకొని నేరస్తులను కోర్టులో హాజరుపరచడం జరిగింది. కేసు పూర్వపరాలను విన్న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉదయ్ నాయక్ నిందితులు ఏడుగురికి మూడు సంవత్సరాల జైలు శిక్ష మరియు ఒక్కొక్కరికీ రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన అధికారులు అప్పటి యస్.హెచ్.ఓలు భాగ్య లక్ష్మి రెడ్డి, ఖాజా ఖాన్, ప్రస్తుత ఎస్సై శ్రీనివాసులు, గద్వాల ఇంచార్జి సిఐ నాగేశ్వర రెడ్డి, ఏ పిపి రెచల్ సంజనా జాషువా మరియు కోర్టు డ్యూటీ అధికారి కోటిలను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు అభినందించారు.

## పత్తికుంట చెరువులో మృతదేహం





బుద్వేల్, అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్‌లోని పత్తికుంట చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. మృతుడు హనుమాన్ నగర్ నివాసి నిరంజన్(45) గా పోలీసులు గుర్తించారు. వినాయకుల నిమజ్జనం సందర్భంగా పట్టుకుంట లో ఉన్న సీకులను తీయడానికి చెరువులోకి దిగి అందులో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## భవానికాలనీ దుర్గామాత దగ్గర చండీ హోమం చేసిన భక్తులు

ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

రాజేంద్రనగర్,అక్టోబర్ 10(ప్రభాత ఉదయం)రాజేంద్రనగర్ సర్కిల్ భవాని కాలనీ లోని ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని దుర్గామాత ఆలయంలో గురువారం చండీ యాగం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగాహొదుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,దుర్గామాతకు కుంకుమార్చన అభిషేకాలు చేశారు.అనంతరం భవానికాలనీ, చెందిన ఓరాది రమేష్,అశోక్ రెడ్డి,పట్లోల శ్రీధర్ రెడ్డి, మాడపాటి కిషోర్ కుమార్,గగన్ పహాడ్ బస్తీకి చెందిన చిట్టి మురళి దాతల సహకారంతో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డి,వైస్ చైర్మన్లు బి. ఆంజనేయులు,సి.బాల్ రాజ్, అధ్యక్షులు పి. నీలకంఠం,కార్యదర్శి ఎం.కృష్ణ యాదవ్, కోశాధికారులు పి.కాశీవిశ్వనాథం,టి.అశోక్ కుమార్, భక్తులు శేఖర్,పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి రూ.1.01.116 లక్షల విరాళం

అందించిన సత్యనారాయణగుప్త



రాజేంద్రనగర్,అక్టోబర్ 10 (ప్రధాత ఉదయం) శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని బీఎన్ రెడ్డికి చెందిన మంచికంటి సత్యనారాయణ గుప్త అన్నారు. గురువారం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,తెలంగాణా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావది లక్ష్మినారాయణ గుప్తా,మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్ దాస్ గౌడ్ ల చేతుల మీదుగా దేవాలయం అధ్యక్షుడు అర్థం లక్షమయ్య గుప్తాకు రూ.1.01.116 విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కన్యకా పరమేశ్వరి ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్ గుప్తా,పానగంటి శేఖర్ గుప్తా,అర్థం శ్రీనివాసులు గుప్తా,న్యాలాంటి నర్సింహా గుప్తా, కలకొండ రామలింగయ్య గుప్త,సోమ అశోక్ గుప్తా, పూరి శ్రీనివాస్ గుప్తా,కొండ కృష్ణయ్య గుప్తా, ఓరుగంటి భద్రయ్యగుప్తా,ఎదిరి సత్య నారాయణ గుప్తా,గొంగలి నరసింహ గుప్తా,గుడిపల్లి శేఖర్ గుప్తా, సరబు అనంతం గుప్తా,వూరే శ్రీనివాస్ గుప్తా,ప్రేమ్ గౌడ్,సరికొండ వెంకటేష్,ఉస్కామూరి నిరంజన్, అర్థం రాజేష్ గుప్తా,ఓరుగంటి మల్లేష్ గుప్తా,చేడం వెంకటరమణ గుప్తా,వనమాల సురేష్ గుప్తా, యమనగడ్ల విజయకుమార్ గుప్తా,సూరిశెట్టి కృష్ణ గుప్తా,యల్లా బాలరాజ్ గుప్తా,చిగుళ్లపల్లి సత్యనారాయణ గుప్తా,జూలూరి సంపత్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## అంధకారంలో కాలనీలు..పట్టింపులేని అధికారులు

చాలా ప్రాంతాల్లో చీకటిరాజ్యం..

విద్యుత్ దీపాల సమస్యను పరిష్కరించాలి..

మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ

రాజేంద్రనగర్,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మోహన్ రెడ్డినగర్, సాయిబాబానగర్,వడ్డెర బస్తీ (ఆదర్శనగర్), బృందావన్ కాలనీ,బాబుల్ రెడ్డినగర్ బస్తీలో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు. గురువారం ఈ మేరకు రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ కురుమ మాట్లాడుతూ...దసరా బతుకమ్మ పండుగ, దీపావళి పండుగ సందర్భంగా వివిధ బస్తీలలో వీధి దీపాలు లేకపోవడంతో మహిళలు,వృద్ధులు,పిల్లలు ఇబ్బందికి గురవుతున్నారన్నారు.శివరాంపల్లి హైవే రోడ్డు నుంచి శివరాంపల్లి రైల్వే స్టేషన్ వరకు వీధి లైట్లు లేక చీకట్లో అక్కడే ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయడం,కొంతమంది ఆకతాయిలతో మహిళలు ఇబ్బందికి గురవుతున్నారు.బస్తీలలోకి వెళితే ఎవరో ఒకరు వీధి దీపాల సమస్యను ప్రస్తావిస్తున్నారని,వారికి సమాధానం చెప్పలేని పరిస్థితి ఎదురవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని ఎస్.వెంకటేష్ కురుమ ఆరోపించారు.అధికారులకు,సిబ్బందికి ఇంటి పన్నుల వసూళ్ల పై ఉన్న శ్రద్ధ కాలనీల అభివృద్ధిపై పట్టింపు లేకుండా పోయిందని విమర్శిస్తున్నారు.ఈ విషయాన్ని మున్సిపల్ ఎలక్ట్రికల్ సిబ్బందికి ఎన్నోసార్లు మొరపెట్టుకున్న స్పందించకపోవడంతో డిప్యూటీ కమిషనర్ రవికుమార్ కు వినతిపత్రం అందించామన్నారు.ఈ మేరకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన వారిలో కార్తీక్ ముదిరాజ్,అనిల్ లింగయత్,భగవాన్ దాస్, రాయుడు,రాజ్ కుమార్,రిషి,సంతోష్,ఆనంద్, జాంగిర్ తదితరులు ఉన్నారు.





డిప్యూటీ కమిషనర్ రవికుమార్ కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ వెంకటేష్

# దామాషా ప్రాతిపదికన ఎన్నికలను నిర్వహించాలి



గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం)దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాల నుండి దృష్టి మరల్చడానికి కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలను అడ్డుపెట్టుకుంటుందని కేంద్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే దామాషా ప్రాతిపదికన ఎన్నికలను నిర్వహించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, టీ.సాగర్ డిమాండ్ చేశారు. గురువారం శాంతినగర్ లోని స్థానిక భవాని ఫంక్షన్ హాల్ లో ఉప్పేర్ నరసింహ సభాధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుస్థిర పాలన పేరుతో దేశ సమాఖ్య వ్యవస్థపై ముప్పేట దాడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల వల్ల దేశంలో ప్రశ్నించే శక్తులను గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో బెల్జియం దక్షిణాఫ్రికా స్వీడన్ దేశాలలో మాత్రమే జమిలి ఎన్నికలను అమలుపరుస్తున్నారని ఈ దేశాలలో కూడా దామాషా ప్రాతిపదికన ఎన్నికల నిర్వహిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం పై ఏమాత్రం విశ్వాసం ఉన్న వచ్చిన సీట్ల ఆధారంగా కాకుండా ఓట్ల సంఖ్య ఆధారంగా ప్రజాప్రతినిధులను ఎన్నిక చెయ్యాలని డిమాండ్ చేశారు. దామాషా ప్రాతిపదిక ఎన్నికల ద్వారా సీట్ల ద్వారా కాకుండా పోటీ చేసిన అభ్యర్థికి వచ్చిన ఓట్ల సంఖ్య ఆధారంగా ప్రజాప్రతినిదులను ఎన్నుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం పరిపుష్టమవుతుందని అన్నారు. ఇటీవల వెలువడిన హర్యానా ఫలితాల్లో కూడా బిజెపి కాంగ్రెస్ పార్టీ కన్న అతి స్వల్పంగా 0.6% ఓట్ల మార్జిన్ మాత్రమే సాధించిందని దీనివల్ల ఓట్ల శాతానికి విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పూర్తయినప్పటికి ఎన్నికల హామీలు అమలు చేయకుండా హైడ్రా పేరుతో పేదల ఇళ్ళు కూల్చి వేయడం సరికాదన్నారు. బహుళ జాతి కంపెనీలు కార్పొరేట్ శక్తులు ఆక్రమించిన భూముల జోలికి వెళ్లకుండా పేదలకు ప్రత్యామ్నాయం చూపించకుండా పేదల ఇళ్ళు కూల్చి వేసే చర్యలు తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఇదే అదనుగా మధ్య దళారులు కృత్రిమ కొరత సృష్టించి విపరీతంగా ధరలను పెంచారని,నిత్యవసర వస్తువులలో కల్తీలు కూడా పెరిగి పోయాయని దీని ద్వారా ప్రజా ఆరోగ్యం సైతం ప్రమాదం లో పడిందని ప్రభుత్వం తక్షణమే ధరలను నియత్రించి ఆహార కల్తీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జూరాల ప్రాజెక్టు పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని,4 %టీఎంసీ% ల సామర్థ్యం కలిగిన ర్యాలంపాడు రిజర్వాయర్ నేడు రెండు టీఎంసీలకు మాత్రమే ఎందుకు పరిమితమైందని ప్రశ్నించారు. ఇలా జిల్లాలోని పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు రిజర్వాయర్ మరమ్మతులు పూర్తి చేసి చివరి ఆయాకట్టు వరకు నీటిని అందించకుండా గట్టు ఎత్తిపోతల పథకం యొక్క సామర్థ్యాన్ని 14 టీఎంసీ లకు పెంచాలని ఆలోచనలు చేస్తూన్నట్లు వార్తలు వస్తున్నాయని దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడమే కాకుండా తక్షణమే ప్రాజెక్టులు రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టువరకు నీరు అందించాలని లేని పక్షంలో రైతాంగాన్ని కలుపుకొని ఉద్యమాలకు సిద్ధం చేస్తామని హెచ్చించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాస్, జి.రాజు, పరంజ్యోతి, వివి నరసింహ, మద్దిలేటి, నర్మద, ఈదన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## చిలుక మర్రి నరసింహపై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టారు

### వెంటనే విడుదల చేయాలి: భార్య ప్రేమలత విజ్ఞప్తి

శంషాబాద్,అక్టోబర్ 10( ప్రభాత ఉదయం) తన భర్త తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలుకమర్రి నరసింహను శంషాబాద్ పోలీసులు అక్రమ కేసు బనాయించి అరెస్టు చేశారని ఆయన భార్య ప్రేమలత ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త ముచ్చింతల గ్రామం అభివృద్ధి కోసం పాటుపడుతుంటే అది నచ్చని మై హోమ్ సంస్థ ఆయనపై కక్ష సాధింపు ధోరణికి పాల్పడుతున్నదని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. మై హోమ్ సంస్థ ప్రోద్భలంతో తన భర్త పై దాడీ చేయించారని తన ప్రాణానికి ముప్పు ఉన్నదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిరిగి ఆయన పైనే అక్రమ కేసు బనాయించి జైలుకు పంపించారని ఆమె అన్నారు. తన భర్త పై బనాయించిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మై హోమ్ సంస్థతో తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని తమకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.



## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

### పాల్గొన్న జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్‌పల్లి,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం) దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్ శ్రీ కనకదుర్గ, నాగదేవతా సహిత పోచమ్మ దేవాలయం కమిటీ సభ్యుడు జనసేన పార్టీ నాయకుడు బండారి ప్రసన్నాంజనేయులు, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ గురువారం అమ్మవారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, మోహన్, పసుపులేటి ప్రసాద్, సూర్య, పులగం సుబ్బు, మరియు దేవాలయ కమిటీ సభ్యులు పద్మారావు, ఏడుకొండలు, ఎం శ్రీనివాస్, నాగేశ్వరరావు, పి శ్రీను , ఎస్ వెంకటేశ్వరరావు, జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ సతీమణి

గద్వాల, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ సతీమణి సద్దుల బతుకమ్మను తలపెట్టుకొని ప్రాంగణం నకు వచ్చి బతుకమ్మ ఆడారు.



## దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం) దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కెపిహెచ్బి లోని రైతుబజార్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాధవరం శ్రీనివాస్ రావు, మండపం నిర్వాహకులు సోను, కొండల్ రావు, రమేష్, నళినికాంత్, ప్రశాంత్ అకెళ్ళ, రంగమోహన్, ప్రవీణ్, సత్తిబాబు పాల్గొన్నారు.





బతుకమ్మ వేడుకల సందర్భంగా అందంగా అలంకరించిన బతుకమ్మను నిమజ్జనానికి తరలిస్తున్న కుమారి ఖుషి రెడ్డి. కుమారి తన్వి రెడ్డి

- శంషాబాద్, అక్టోబర్10 (ప్రభాత ఉదయం)




## విజయదశమి పర్వదినం సందర్భంగా పోలీస్ అధికారులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు జనంపల్లి పురేందర్ రెడ్డి

కూకట్‌పల్లి,అక్టోబర్ 10 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి, కార్యదర్శి ఆర్ రామచంద్ర రావు, కమిటీ సభ్యులు జి ప్రసాద్, ఎస్ శ్రీధర్ రావు, వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు దసరా పండగ సందర్భంగా కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ సిఐ ముత్తు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అదేవిధంగా ఎస్సై రామకృష్ణ, ఎస్సై దీక్షిత ను కలిసి శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం స్వీట్లు అందజేసి అభినందనలు తెలుపుతూ అధ్యక్షులు పురేందర్ రెడ్డి అధికారులకు బతకమ్మ దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.



## జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10(ప్రభాత ఉదయం)బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను, మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు.గురువారం ఐ.డి.ఓ.సి ఆవరణలో ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ సంబరాలలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌరీమాత పూజ నిర్వహించి, బతుకమ్మ వేడుకలను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ శాఖలు రంగు రంగుల బతుకమ్మలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు తెలియజేస్తూ బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజల బ్రతుకులు బాగుండాలని గౌరమ్మ తల్లిని వేడుకుందామన్నారు. మన పండుగ, మన సంస్కృతి ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక ఈ బతుకమ్మ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. బతుకమ్మ పండుగ మన వారసత్వాన్ని కాపాడే గొప్ప పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ ఉత్సవాల అనంతరం, జిల్లా కలెక్టరేట్‌కు చెందిన మహిళా అధికారులు సంతోషంగా బతుకమ్మలను చేతబెట్టుకుని కలెక్టరేట్ కార్యాలయం నుండి తేరుమైదాన్‌కు వెళ్ళడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ,నర్సింగ రావు, ఆర్.డి.ఓ రామ్ చందర్, వివిధ జిల్లా శాఖల అధికారులు, మహిళ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.